క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్ : దేశభక్తి, జాతీయభావం, తెలుగుదనం ప్రతిబింబించేలా చక్కని చిత్రాలతో ఉట్టిపడేలా హిందూ ఉపాధ్యాయ సమితి క్యాలెండర్ ఉందని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శోభకృత్ నామ తెలుగు సంవత్సర ఉగాది సందర్భంగా బుధవారం కడప హిందూ ఉపాధ్యాయ సమితి రూపొందించిన క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ ఆర్థిక కార్యదర్శి సమ్మెట శశిధర్, ఎంఈఓ పాలెం నారాయణ, హిందూ ఉపాధ్యాయ సమితి రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న మేయర్ కె. సురేష్‌బాబు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో తైక్వాండో శిక్షకుడు జంషీర్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు తైక్వాండోలో బ్లాక్ బెల్ట్‌కు అర్హత సాధించారు. ఎస్. సద్రిఅలం, అభిషేక్, ఉమర్‌అబ్దుల్లా, హలీమ సాదియ, అలకనంద, హృదయకుమార్ బ్లాక్‌బెల్ట్ సర్టిఫికెట్‌లు సాధించడంపై కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు క్రీడాకారులను అభినందించారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన మేయర్

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు అవుట్ గేట్ వద్దనున్న చిల్లీస్ రెస్టారెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నగర మేయర్ కె. సురేష్ బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో ఆర్‌ఓ ప్లాంట్ వాటర్‌ను ప్రజలకు అందించడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యజమానులు హర్షవర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సురేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంజన్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, యల్లారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మినరసింహ స్వామి కల్యాణం



వెయ్యినూతల కోనలో కల్యాణంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వాముల వారు

పెండ్లిమర్రి : తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని వెయ్యినూతల కోనక్షేత్రంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి, లక్ష్మిదేవి అమ్మవార్ల కల్యాణం బుధవారం ఆలయ కార్యనిర్వాహకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

ఘనంగా గంగమ్మతల్లి జాతర

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతర కన్నుల పండువగా సాగుతోంది. బుధవారం ఉదయం 3 గంటలకు గంగమ్మతల్లి ప్రతిమను ప్రతిష్ఠించారు. గంగమ్మతల్లితో పాటు బోగాదమ్మ, చౌడమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. చౌడమ్మతల్లి గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఎటువంటి సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ రాజారమేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 6 గంటలకు గంగమ్మతల్లి ప్రతిమను గ్రామ పొలిమేర వద్ద విడిచిపెట్టడంతో జాతర ముగుస్తుందని జాతర కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా చెన్నకేశవస్వామి గ్రామోత్సవం



వీరపునాయునిపల్లె : ఉగాది పండుగను పురష్కరించుకుని మండంలోని ఎన్. పాలగిరి గ్రామంలో లక్ష్మిదేవి సమేత చెన్నకేశవస్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది. గ్రామోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులను అలంకరించారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇంటింటా.. పండుగ శోభ

- నగరంలో ఘనంగా ఉగాది వేడుకలు
- ఆలయాల్లో పూజలు.. పలు సంస్థల ఆధ్వర్యంలో పండుగ నిర్వహణ





హౌసింగ్‌బోర్డు రామాలయంలో పంచాంగ పఠనం చేస్తున్న చక్రవర్తుల నాగాంజనేయశర్మ, పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్: స్థానిక విజయదుర్గాదేవి ఆలయంలో శ్రీ శోభకృత్ ఉగాదిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌ల ఆధ్వర్యంలో అర్చకులు ఉగాది పంచాంగాన్ని భక్తులకు చదివి వినిపించారు. ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకు ప్రతిరోజు విశేష పూజలతో వసంత నవరాత్రులను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అమ్మవారి ప్రసాదంగా ఉగాది పచ్చడిని అందజేశారు.

కొత్తదనం కోరుకునేదే జీవితం!

ఎప్పటికప్పుడు కొత్తగా ఉండేదే నిజమైన జీవితమని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. బుధవారం స్థానిక మానస ఇన్ హోటల్‌లో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సందడిగా నిర్వహించారు. తొలుత వేద పండితులు విజయ్‌భట్టర్ పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ చీఫ్ ప్యాట్రన్ లయన్ మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ జీవితమంటే కష్టసుఖాలమయమని, ఎన్ని కడగండ్లు వచ్చినా విజయమే లక్ష్యంగా ముందడుగు వేయాలన్నది ఉగాది పండుగ అంతః సూత్రమన్నారు. అలాగే జీఎస్టీ సర్కిల్–1 అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రంగనాథరెడ్డి, గౌరీశంకర్, ప్యాట్రన్ అలపర్తి పిచ్చయ్యచౌదరి, ది కడప హోటలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.రషీద్‌ఖాన్ తదితరులు మాట్లాడారు. మహిళల పక్షాన పారిశ్రామిక వేత్త అసంతమ్మ, విజయమ్మలు మాట్లాడారు. కవితాగానం చేసిన కవులను సన్మానించారు. మహిళలకు పోటీలు నిర్వహించి పోతుల వెంకట్రామిరెడ్డి సౌజన్యంతో విజేతలకు బహుమతులు అందజేశారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు



వివిధ పోటీల్లో గెలిచిన మహిళలతో నిర్వాహకులు

సమాజాభివృద్ధి కోరినపుడే ప్రయోజనం

సమాజం అభివృద్ధిని కోరినపుడే కవిత్వానికి నిజమైన ప్రయోజనమని యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు ఎన్.ఈశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం సాహితీ స్రవంతి స్థానిక బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించిన ఉగాది 'జన కవనం'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజ హితమే సాహిత్య లక్ష్యం కావాలని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులనుద్దేశించి ప్రసంగించారు. విశిష్ట అతిథి, బ్రౌన్ గ్రంథాలయం సంచాలకులు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రాచీనకాలమైనా, ఆధునిక కాలమైనా సమాజానికి ఉపయోగపడే కవితాన్నే స్వీకరించాలన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి, సంస్థ జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్ మాట్లాడారు. డాక్టర్ రాజేశ్వరమ్మ కవితల పోటీల్లో పాల్గొన్న కవులకు కురుకూటి సుబ్బరాయుడు పేరిట రూ. 2 వేల నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కవితల పోటీల్లో పాల్గొన్న బాలబాలికలకు కూడా బహుమతులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు మద్దెల వినోద్, అమృతవల్లి, సాగర్, వేంపల్లె ప్రతాప్, కవి డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ముక్తియారున్నీసా, హర్షిత పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో ఉగాది పూజలు

కడప నగరం శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో శోభకృత్ నామ ఉగాది పండుగను పురస్కరించుకుని బుధవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మూలమూర్తులతోపాటు ఉత్సవ మూర్తులకు కూడా తిరుమంజన సేవ నిర్వహించి కనుల పండువగా అలంకరించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలతోపాటు పండుగ ప్రత్యేక ప్రసాదంగా సంప్రదాయ ఉగాది పచ్చడిని అందజేశారు. సాయంత్రం తిరుమల–తిరుపతి దేవస్థానాల వేదిక్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, రాయలసీమ ఆగమ సలహాదారు కేహెచ్ రాజేష్‌కుమార్ పంచాంగ పఠనం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో భక్తులు సామూహికంగా సహస్ర నామ పారాయణం పూజలు నిర్వహించారు.

ఆశ్రమాల్లో 'ఆశారేఖ' అన్నదానం

కడప నగరానికి చెందిన ఆశారేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శోభకృత్ నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానికంగా గల అన్ని బాలలు, వృద్ధుల అనాథాశ్రమాల్లో విందు భోజనం అందజేశారు. నాగవేణితోపాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షాలు, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్ర మంతటా వర్షాలు బాగా పడతాయని, పాడి పంటలు సంవృద్ధిగా ఉంటాయని, రైతుల జీవితం మెరుగు పడుతుందని ప్రముఖ జ్యోతిష్య నిపుణులు సురేష్ బాబు తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం కడప నగరంలోని ఆయన కార్యాలయంలో పంచాంగ పఠనం చేశారు. పంచాంగం నుంచి పలు ఆసక్తికరమైన అంశాలను వివరించారు.

సంప్రదాయ వస్త్రధారణలో నాయకులు

కడప కార్పొరేషన్: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకొని మేయర్ కె. సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సాంప్రదాయ వస్త్రధారణలో మెరిశారు. పలువురు నేతలు తెల్లచొక్కా, పంచె కట్టులో మేయర్‌ను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మెన్ యానాదయ్య, బోవిళ్ల క్రిష్టారెడ్డి, మల్లికార్జున, లక్ష్మయ్య, ఆర్‌వీ రమణ, యల్లారెడ్డి, రామక్రిష్ణ పాల్గొన్నారు.

హనుమంతరావుకు ఉగాది సత్కారం

కడప ఎడ్యుకేషన్: తెలుగు ప్రజలకు ముఖ్య పండుగ ఉగాది అని ప్రముఖ సీనియర్ వైద్యులు ఎంఎం ఆసుపత్రి అధినేత డాక్టర్ మహబూబ్‌పీరా అన్నారు. రాయల్ కరీం సేవాసమితి ఆధ్వర్యంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మొల్ల సాహితపీఠం అధినేత గానుగపెంట హనుమంతరావును సన్మానించారు. కీళ్లు, నరాల వైద్యులు ఎస్ఎండీ అబిద్, రాయల్ కరీముల్లా, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నేత చెంచిరెడ్డి పాల్గొన్నారు.

- కవిత్వ, సాహిత్యం వక్తుల వ్యక్తిత్వానికి పునాదులని సమగ్రశిక్ష ప్రాజెక్టు జిల్లా అధికారి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప పెన్నర్ల కార్యాలయంలో కల్లూరి చిన్న ఎల్లారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కల్లూరి బాల ఎల్లారెడ్డి అధ్యక్షన కవిసమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కవులను సన్మానించారు. పెన్నర్ల సంఘం అసోసియేట్ కార్యదర్శి రామమూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగ మునిరెడ్డి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భవిష్య ప్రణాళిక కోసమే పంచాంగం

కడప కల్చరల్ : భౌగోళిక, సామాజిక వాతావరణ పరిస్థితులను తెలుసుకుని మన జీవితాలు సాఫీగా సాగేందుకు అవసరమైన భవిష్య ప్రణాళికలు రూపొందించుకునేందుకే పెద్దలు పంచాంగాలను తయారు చేశారని ప్రముఖ వేద పండితులు, పంచాంగకర్త చక్రవర్తుల నాగాంజనేయశర్మ పేర్కొన్నారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం కడప హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయంలో ఘనంగా ప్రారంభించారు. తొలుత ఆయన వేదికపై ఏర్పాటు చేసిన శ్రీ సీతారామలక్ష్మణుల ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు డి.వెంకటరెడ్డి పంచాంగ కర్తను సత్కరించారు.



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి



పంచాంగ పఠనం చేస్తున్న రాజేష్‌భట్టర్



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ



విజయదుర్గాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు

కమలాపురం : తెలుగు నూతన సంవత్సరం(ఉగాది) వేడుకలను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడకలను ప్రజలు మండలంలోని ఊరూరా వైభవంగా నిర్వహించుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని తెల్లవారు జామున నుంచే పిల్లా పెద్ద తేడా లేకుండా తలస్నానాలాచరించి నూతన సాంప్రదాయ వస్త్రాలు ధరించి సమీపంలోని ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త ఏడాది అన్ని వర్గాల ప్రజలకు అన్నీ శుభాలు కలగాలని వేడుకున్నారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

సర్వ ఆదాయం 109 ...సర్వ వ్యయం 95...

శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో ఆదాయం ఎక్కువ, వ్యయం తక్కువగా ఉందని ప్రముఖ వేద పండితులు పవన్‌కుమార్ శర్మ తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకుని స్థానిక అమ్మవారిశాలలో ఆయన పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. సర్వ ఆదాయం 109 ఉందని, సర్వ వ్యయం 95 ఉందన్నారు. ఈ ఏడాది బుధుడు అధిపతిగా ఉంటాడని దీంతో సర్వం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. ధాన్యం ధరలు తగ్గుతాయన్నారు. పాలకులు సుభిక్షంగా ఉంటారని, తద్వారా వారు మంచి పాలన అందిస్తారన్నారు. అలాగే చదిపిరాళ్లలోని అగస్త్రేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు రామ కేశవ శర్మ, ఎర్రగుడిపాడులోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో వేద పండితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ సత్యబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి వేద పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు నూతన సంవత్సరంలో సర్కిల్ పరిధిలోని ప్రజలకు అన్ని శుభాలు కలగాలని సీఐ ఆకాంక్షించారు.





పోలీస్ స్టేషన్‌లో సంప్రదాయ దుస్తుల్లో సీఐ, పోలీస్ సిబ్బంది, ఎర్రగుడిపాడులోని ఆలయంలో ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి

నిరుపేదలకు బియ్యం పంపిణీ

బద్వేలు అర్బన్ : మాస్క్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ మాసం, ఉగాది పండుగలను పురస్కరించుకుని బుధవారం స్థానిక ఫాతిమా మసీదు ఆవరణలో కులమతాలకు అతీతంగా 150 నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాస్క్ కమిటీ అధ్యక్షులు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, మాస్క్ కమిటీ సెక్రటరీ సరిటాల మౌలాలిలు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా రెండు సంవత్సరాలుగా బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని, అల్లా దయతో ఇకపై కూడా ప్రతి నెల పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని తెలిపారు.



బియ్యం పంపిణీ చేస్తున్న మాస్క్ కమిటీ నాయకులు

కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ కరీముల్లా, వైఎస్సార్‌సీపీ 13వ వార్డు ఇన్‌చార్జి షఫీ, మాస్క్ కమిటీ సభ్యులు ఖాదర్‌బాషా, హుస్సేన్, సలీం, మత పెద్దలు పాల్గొన్నారు.

రామలింగ చౌడేశ్వరికి ఘనంగా బిందెసేవ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హనుమాన్ నగర్‌లోని రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో బుధవారం ఉగాది సందర్భంగా అమ్మవారికి ఘనంగా బిందెసేవ నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అమ్మవారి మూలవిరాట్‌ను అలంకరించారు. సాయంత్రం దేవాంగపేట నుంచి అమ్మవారి ఉత్సవ మూర్తిని అమ్మవారి నామస్మరణల మధ్య ఘనంగా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అంగన్వాడీల ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న వర్కర్, హెల్పర్‌ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సుజామణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె అందులో పేర్కొన్నారు. ఖాళీల వివరాలను, రిజర్వేషన్ వివరాలు ఇలా ఉన్నాయి. కమలాపురం మండలం అప్పారావుపల్లె–ఆయా (బీసీ–డీ), ఎర్రగుంట్ల మండలం కేజీవీపల్లె–వర్కర్ (ఓసీ), తిప్పలూరు–వర్కర్ (ఓహెచ్), బిస్మల్లాబాద్ –ఆయా (ఎస్టీ), వీరపునాయునిపల్లె మండలం అంకిరెడ్డిపల్లె–వర్కర్ (ఎస్టీ), ఎ.ఓబాయపల్లె–ఆయా (వీహెచ్), ఉరుటూరు–1– ఆయా (బీసీ–సీ) ఈ స్థానాల భర్తీకి రోస్టర్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆమె తెలిపారు. ఈనెల 27వ తేదీ లోగా అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను కమలాపురంలోని ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలన్నారు. 10వ తరగతి పాసై, 21సం. పూర్తి అయి 35ఏళ్ల లోపు ఉన్న వారే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆమె అన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

వల్లూరు : కడప రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వల్లూరు మండలంలో ఖాళీగా వున్న అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు ఈనెల 27వ తేదీలోపు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో చిన్నపుత్త, కుముద్‌బెన్‌జోషి నగర్ అంగన్‌వాడీ కేంద్రాలలో సహాయకురాలు పోస్టులు ఖాళీగా వున్నాయని తెలిపారు. ఇందులో చిన్నపుత్త అంగన్ వాడీ సహాయకురాలు పోస్టు ఓసీలకు, కుముద్‌బెన్‌జోషి నగర్ అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టు ఎస్టీలకు కేటాయించబడిందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి బయోడాటాతో అన్ని ధృవీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించి వాటిని కడప రూరల్ ఐసీడీఎస్ కార్యాలయంలో అందచేయాలని తెలిపారు.

పేదలకు రంజాన్ కిట్ల పంపిణీ

కడప కల్చరల్ : కడప నగరం అల్మాస్‌పేటలోని జామియా తుస్సాలిహత్ మదరసాలో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని బుధవారం పేదలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వారికి బియ్యం ప్యాకెట్లతోపాటు రంజాన్‌కు అవసరమైన ఇతర నిత్యావసర సరుకులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఏడురోడ్ల మసీదు ఇమామ్ హజరత్ వలీవుల్లా హుసేనీ సాహెబ్ మాట్లాడుతూ కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా రంజాన్ కిట్లు పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ముక్తార్ అహ్మద్, ఉపాధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా, కార్యదర్శి షేక్ హిదాయతుల్లా, కోశాధికారి జిలానీ బాషా, బాబుభాయి, డాక్టర్ సమీవుల్లా, మహమ్మద్ హనీఫ్, మదరసా సిబ్బంది పాల్గొన్నారు.



రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

వైభవంగా కొండగంగమ్మ తిరునాల



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి

పెండ్లిమర్రి : తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండగంగమ్మ తిరునాల ఉత్సవాలు బుధవారం వైభవంగా అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఆకుపూజ, అభిషేకాలకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ ఏ. మల్లికార్జునరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ రామమోహన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. పోటీలో గెలుపొందిన వారికి ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలిశివ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రామమోహన్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

ఘనంగా మదరసా వార్షికోత్సవం

కడప కల్చరల్ : కడప నగరంలోని నురాని మసీదు లోగల జామియతుల్ ఖురేషి మదరసా 10వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మదరస అధ్యక్షులు షామీర్‌బాష ఖురేషి ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మత గురువు మౌలాన ముఫ్తీ హజరత్ మగ్దూం మోహిద్దీన్ ఖాసిమి సాహెబ్ ప్రసంగించారు. అలాగే పవిత్ర ఖురాన్ నేర్చుకున్న తొమ్మిది మంది బాలబాలికలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు గులాంనబీ, షాబుద్దీన్, ఇషాక్, బషీర్, గౌస్‌పీర్, రజాక్, సలీం, జలీల్, అక్బర్ హుసేన్, మదరస సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మౌలాన ముఫ్తీ మగ్దూం మోహిద్దీన్ ఖాసిమి సాహెబ్